# నీటి బొట్టు

శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి



నకల జీవకోటికి ఆధారం నీరు. ప్రకృతి ఇచ్చిన వరం నీరు. ఆ వరాన్ని కాపాడుకోవడం మన బాధ్యత. మనం ఆ బాధ్యతని విస్మరిస్తే రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో నీరు ఒక అపురూప వస్తువుగా మారితే ఎలా వుంటుందో ఇద్దరు రచయిత్రులు వ్యంగ్యంగా రాసిన కథల్ని వరుసగా చదవండి.

**2030** సంవత్సరం

హైదరాబాదు

"రమాపతిగారూ! ఇవాళ మీకు ఎన్ని నీటిబొట్లు వచ్చాయి కుళాయిలో? గ్లాసులు నిండాయా?"

"ఆ... ఏం నిండడం..? రెండు వందల తొంభై ఏడు నీటి బొట్లు వచ్చాయి. మీకెన్ని వచ్చాయి భాగ్యలతగారూ?"

"మీకే నయం. దగ్గర దగ్గర మూడు వందల నీటి బొట్లు వచ్చాయి. మళ్ళీ రేపు నల్లా రాదు. నల్లా గొట్టాలు బాగు చేస్తున్నారట. నీటి బొట్లు ఇంకా ఎక్కువ రావటానికి. అందుకే ఇవాళ సాయంత్రం కూడా నీటిబొట్లు వదుల్తారని పేపర్లో వేసారు. మా ఇంటికి చుట్టాలు

కూడా వచ్చారు. ఎలా గడుపుకో వాలో ఏమిటో. ఒక్క గ్లాసు కూడా సరిగా నిండలేదు. ఆ పై వాటా ఆవిడ ఏకంగా పది గ్లాసులు నీటి బొట్లు నింపుకుంది. ఒక్కళ్ళే అన్ని నీటిబొట్లు పట్టుకుంటే మిగతా వాళ్ళకి అక్కర్లేదా? ఆవిడ నోటికి జడిసి ఊరుకున్నాం. అసలే ఈ అపార్టుమెంటు సెక్రెటరీ కదా. రేపు అవసరంపడితే నాలుగు నీటిబొట్లు ఆవిడ్నే అడగాలి అందుకనే ఆవిడ ఎన్ని నీటిబొట్లు పట్టుకున్నా అడిగే సాహసం ఎవరూ చెయ్యరు.''

''ముందర ముందర ఈ నీటి బొట్లకి కూడా కరువు రావచ్చుట రమావతిగారూ. నీటిబొట్టులేందే ఎలా బతకాలో ఏమిటో అర్థం కావట్లేదు. పూర్వం రోజులే బాగున్నాయేమో రమావతిగారూ. అప్పుడు బిందెలు, గుండిగలు అని చాలా పెద్దవి వుండేవట. అంటే ఇప్పుడు మనం నీటి బొట్లు పట్టుకునే గ్లాసుల కన్నా ఎన్నో ఎన్నో వేల రెట్లు పెద్దవన్న మాట. అప్పుడు వాటిలో నీటి బొట్లు, కాదు,...కాదు...నీళ్ళు...నీళ్ళు....బోల్డు నీళ్ళు పట్టుకునేవారన్న మాట. నల్లా రావడం పాపం, ఆ నీళ్ళ గురించి క్యూల్లో వుండేవారట. ఒక్కోసారి పెద్ద కొట్లాటలు కూడా అయ్యేవట. మా నానమ్మ ఈ నీళ్ళ గాథలు చెబుతుంటే ఆశ్చర్యపోతుంటాను.''

''అయినా అన్ని నీళ్ళు ఏం చేసుకునేవారు భాగ్యలతగారూ? ఎందుకు అంత నీరు?''

''అమ్మో, చెప్పాలంటే పెద్ద గ్రంథం అవుతుంది రమావతిగారూ. పేపర్లలో, పుస్తకాల్లో, 'వింతలు విడ్డూరాలు' అని వేస్తారు. చదవటల్లా? మా అబ్బాయి ఫోర్తు క్లాసులో అయితే 'నీటి చరిత్ర' అనే పాఠ్య పుస్తకం వుంది. ఆ పుస్తకం చదవండి. అన్ని విషయాలూ తెలుస్తాయి. ఆ రోజుల్లో 'అన్నం' అనే పదార్థం వుండేదట. ఆకలి వేస్తే ఆ అన్నం వండుకు తినేవారట. మనలా టాబ్లెట్సు తినడం కాదు.''

''అన్నం వండుకోవడానికీ, నీళ్ళకీ ఏమిటి సంబంధం భాగ్యలత గారూ?''

''ఏమిటీ, రమావతిగారూ! భాగ్యలత గారు నీటి బొట్ల గురించి చెబుతున్నారు?''

''రండి, రండి, ఉమాభారతిగారూ! భాగ్యలత గారు నీటి బొట్ల గురించి చెబుతున్నారు.''

నీటిబొట్లు కాదు రమావతిగారూ! నీళ్ళు... నీళ్ళు... అన్నా. ఈ నీటిబొట్లకన్నా చాలాచాలా ఎక్కువన్న మాట. అందుకే వాటిని నీళ్ళు అంటాము.''

''ఊ....చెప్పండి....చెప్పండి భాగ్యలతగారూ! అప్పటి వాళ్ళు అన్నాలు ఎలా వండేవారో.''

''అన్నాలు కాదు రమావతిగారూ. అన్నం... అన్నం. అంటే వంట చేయడం అన్నమాట. అన్నం ఎలా వండేవారో చెబుతా వినండి. మధ్యలో ప్రశ్నలు వేయకండి.''

**ఇంకా అప్పుడు చెట్లు అవీ వుండేవి కదా? వీటికీ నీళ్ళు పోసేవారు. ఇప్పుడు ఆ చెట్లే లేవు. మచ్చుకి ఒక్కటి కూడాలేదు. అవన్నీ నరికేసారు. అందుకేనేమో వర్షాలూ లేవు. ఇంకా అప్పుడు పంటపొలాలుండేవి. వాటికీ చాలా నీళ్ళు కావల్సి వచ్చేది. కరెంటుకి కూడా నీళ్ళు కావల్సి వచ్చేది.**

భాగ్యలత చెబుతుంటే చుట్టూ చేరి ఆసక్తిగా వింటున్నారందరూ.

''ముందర ఉదయం నిద్రలేవగానే బాత్రూమ్‌కో, దేనికో వెడితే అక్కడో బకెట్ నీళ్ళు పారబోసేవారు. తరువాత సబ్బు పట్టించుకుని స్నానం లాంటిదేదో చేసేవారు. అంటే శరీర శుభ్రతకి అన్నమాట. ఇప్పుడంటే మనం లేవగానే మన మొహం, శరీరం మిషన్ ద్వారా గాని, లేక మెషిన్‌రూమ్ వున్నవాళ్ళు ఆ రూమ్‌లోకి వెళ్ళి స్విచ్ ఆన్ చేయగానే శరీరం ఫ్రెష్ అయిపోతుంది. నీళ్ళకి కరువొచ్చినందున సైంటిస్టులు ఎన్నో ప్రయోగాలు చేసి ఈ మిషన్లు కనిపెట్టారన్న మాట మన తరం వారికి. వాళ్ళే గనక లేకపోతే ఈ సిటీ కరువుకి తోడు మన గతేమైవుండేది? అందుకని మనం సైంటిస్టుల రుణం ఎప్పటికీ తీర్చుకోలేము. సరే, అసలు విషయానికి వద్దాం. ఏం? ఇప్పుడేమో మిషన్ ద్వారా శరీరం ఫ్రెష్ అయాక, కాఫీ టాబ్లెట్ వేసుకుంటాము. అప్పుడలా కాదు. కాఫీకి ముందర నీళ్ళు కాచి, దాంట్లో కాఫీ పొడి వేసి, తరువాత ఆ కాఫీ డికాషన్‌లో పాలు, పంచదార కలుపుకుని కప్పుల్లో పోసుకుని హాయిగా పేపర్ చదువుతూ తాగేవారు. బ్రేక్‌ఫాస్ట్ ఇడ్లీ గాని, ఉప్మా గాని, లేక ఉప్మా పెసరట్టు, దోశ, పూరీ... ఇలా ఎన్నో రకాల టిఫిన్లు చేసుకునే వారు. ఇవన్నీ నీళ్ళతోనే చేసేవారు. ఇంకా అన్నంలోకి కూరలు, సాంబార్, రసం... ఇలా ఎన్నో వంటకాలు నీళ్ళతోనే చేసేవారు.

అన్నం నీళ్ళతో ఎలా వండేవారో చెబుతా వినండి.

ముందర బియ్యం గిన్నెలో పోసి మూడుసార్లు మూడు చెంబుల నీళ్ళతో కడిగి, అందులో సరిపడగా నీళ్ళు పోసి, స్టౌ మీద పెడితే, కాసేపటికి కుత కుత వుడికి అన్నం తయారవుతుందన్న మాట. అదే వాళ్ళ ముఖ్య ఆహారం. మనకిప్పుడు రైస్ టాబ్లెట్సు లాగన్న మాట. అన్నంలోకి ఇంకా అనేక రకాల తినుబండారాలు చేసుకునే వారు. అంటే కాజాలు, జంతికలు, మైసూర్‌పాక్, జాంగ్రి..చెప్పాలంటే చాలా వున్నాయి. ఇవన్నీ నీళ్ళతోనే చేసేవారు. పండగలొస్తే పులిహోర, చక్రపొంగలి, అరిసెలు, బొబ్బట్లు చేసుకు తినేవారు. ఇవన్నీ చేయటానికి పెద్ద గది వుండేది. అంటే వంటశాలన్న మాట. లేక కిచెన్. ఆ కిచెన్‌లో గ్యాస్‌స్టౌ, అనేక రకాల వంటపాత్రలు, మూకుళ్ళు, నీళ్ళ బిందెలు, ఇంకా పప్పులు, పిండి డబ్బాలు... ఇలా చాలా వుండేవి. అప్పుడు అందరాడవాళ్ళూ ఉద్యోగాలు చేసేవారు కాదు. ఎప్పుడూ భర్తగారికీ, పిల్లలకి, అత్తమామలకి, ఆడబడుచులకి, వచ్చిన చుట్టాలకి వంటలు చేస్తూ, ఎప్పుడూ వంటింట్లోనే వుండేవారు. అందుకే వాళ్ళని 'వంట ఇంటి కుందేలు' అని కూడా అనేవారు. ఇక పెళ్ళిళ్ళకి, ఫంక్షన్స్‌కి అయితే ఎంతో మంది బంధుమిత్రుల్ని పిలిచి విందు భోజనాలు పెట్టేవారు. వాటన్నిటికీ చాలాచాలా నీళ్ళు వాడేవారట. నీళ్ళు చాలకపోతే టాంకర్లతో పోయించుకునేవారు.

ఇంకా అప్పుడు చెట్లు అవీ వుండేవి కదా? వీటికీ నీళ్ళు పోసేవారు. ఇప్పుడు ఆ చెట్లే లేవు. మచ్చుకి ఒక్కటి కూడాలేదు. అవన్నీ నరికేసారు. అందుకే నేమో వర్షాలూ లేవు. ఇంకా అప్పుడు పంటపొలాలుండేవి. వాటికీ చాలా నీళ్ళు కావల్సి వచ్చేది. కరెంటుకి కూడా నీళ్ళు కావల్సి వచ్చేది. ఇప్పుడు సూర్యశక్తి ద్వారా సోలార్ కరెంటు వస్తోందన్నమాట. అప్పటి వాళ్ళు స్నానాలకని, తలంట్లకని, బాత్రూమ్‌కని వట్టినే నీళ్లు పారపోసేవాళ్ళు. ఇంకా వాళ్ళు తిన్న కంచాలు, టిఫిన్‌ప్లేట్లు, కాఫీ గ్లాసులు, వంటపాత్రలకి కడిగే నీళ్ళు, బట్టలుతకడానికి పారబోసే వాళ్ళు. నీళ్ళు...మనం గ్లాసులలో ఎంతో అపురూపంగా పట్టుకునే నీటిబొట్ల కన్నా చాలా చాలా... ఎన్నో కోట్ల రెట్లు ఎక్కువన్న మాట. నీళ్ళు వృథా చెయడంలో మాత్రం ఎవరూ తక్కువ తినలేదు. అందరూ పోటాపోటీగా నీటిని వృథా చేసేవారు. కుళాయి గొట్టాలు చిల్లులు పడి ఎన్నో బిందెల నీళ్ళు రోడ్ల మీద యధేచ్ఛగా ఏరులై, సెలయేరులై, చూస్తూ మనకెందుకులే అని వెళ్ళిపోయేవారే గాని అరికట్టే ప్రయత్నాలు ప్రభుత్వం గాని, ప్రజలు గాని చేసేవారు కాదు. అందుకే అప్పుడు డబ్బు నీళ్ళలా ఖర్చు చేయకూడదనే వారు. కానీ ఇప్పుడు వచ్చే నీటిబొట్లు డబ్బులా ఖర్చు చేసే రోజులు. నాకు నీళ్ళ గురించిన ఈ విషయాలన్నీ చదువుతుంటే చాలా బాధొచ్చింది. అప్పటి వాళ్ళు నీళ్ళు వృథా చేయబట్టే కదా, ఇప్పుడు మనం నీళ్ళు బొట్లుగా వాడుకోవల్సివస్తోంది.'' అంటూ చెప్పిన భాగ్యలత కంట్లోంచి రాలిన రెండు కన్నీటి బొట్లు చీర చెంగుతో తుడుచుకుంటూ మళ్ళీ బాధతో అంది.

''అన్నట్టు, అప్పుడు వాళ్ళు కట్టి విడిచిన మాసిన బట్టలు వుతకటానికి రోజూ డ్రమ్ములకొద్దీ నీళ్ళు వాడేవారట. మనకంటే ఇప్పుడు ఎవర్‌ఫ్రెష్ బట్టలు వచ్చాయి. కాబట్టి మాయడం వుండదు. సమ్మరొస్తే రోజుకి రెండుసార్లూ, మూడు సార్లూ స్నానాల పేరుతో నీళ్ళు పారబోసేవారట. చిన్న పిల్లలు కూడా నీళ్ళని చూడగానే ఆనందం వేసి నీళ్ళని పారబోస్తూ నీటితో ఆడుకునే వారట. చంటి పిల్లల స్నానాలకు ఏకంగా నాలుగు బకెట్ల నీళ్ళు పోసేవారట.''

''అవును. మా తాతయ్యా ఈ నీళ్ళ కథలు ఎన్నో చెబుతుంటాడు. రాత్రి పదింటికి ఈ కథలు అందరం ఎంతో ఆసక్తిగా వింటుంటాము.''

''అప్పుడు ఉప్మా, ఇడ్లి, వడ, దోశ, మైసూర్ బజ్జీ, ఆలూ బోండా, కట్‌లెట్, చక్రపొంగలి.... ఇలా ఎన్నో రకాలు చేసుకు తినేవారట. చాలా రుచిగా వుండేవట. నీటికొరత వల్ల ఇప్పుడీ టాబ్లెట్లు వచ్చాక జిహ్వ చచ్చిపోయింది. తినడం అంటే ఏమిటో మర్చిపోయి, రోగిష్టి వాళ్ళలా తిండికి

కూడా ఈ టాబ్లెట్లు మింగాల్సిన ఖర్మ పట్టిందీ నాడు అని బాధ పడతాడు మా తాతయ్య. అప్పటి తినుబండారాల గురించి చెబుతుంటే నాకూ నోరూరింది. అప్పుడు వంటల గురించి వంటల పుస్తకాలు కూడా వుండేవట. మా నానమ్మ రాసిన వంటల పుస్తకం ఓటుంది. అది చూసి చేసుకు తిందామని అనుకుంటే బోలెడు నీటిబొట్లు, అదే నీళ్ళు కావాలి. స్టౌ, గిన్నెలు, పోపుల గింజలు, నూనెలు... ఇలా ఎన్నో కావాలి. అది జరిగే పని కాదు. అందుకే ఉప్మా కంటెంటున్న టాబ్లెట్ ఒకటి, ఇడ్లీ టాబ్లెట్ ఒకటి, దోశ, వడ, టాబ్లెట్లు వేసుకున్నాను. అందుకే ఇవాళ దాహం ఎక్కువగా వుంది. దాహం టాబ్లెట్లు ఆరు వేసుకున్నా దాహం తీరలేదు. ఒళ్ళు బరువుగా కూడా వుంది.''

''శీలా! నువ్వు డైటింగ్ చేయాలమ్మా. అన్నిరకాల టాబ్లెట్లు ఒక్కసారే వేసుకోకూడదు. అందులో నువ్వు చిరుతిండి టాబ్లెట్లు కూడా ఎక్కువేసేసుకుంటావు. దాహం టాబ్లెట్లు ఆరు వేసుకున్నా దాహం తీరటల్లేదంటే నువ్వు ఎంత బరువున్నావో తెలుస్తోంది. ఈ వయసులో అంత బరువుండకూడదమ్మా. నన్నూ ఆ మధ్య బరువు పెరిగానన్నారందరూ. అందుకే డైటింగ్ చేసా. రైస్ టాబ్లెట్లు గాని, టిఫిన్ టాబ్లెట్లు గాని అసలు వేసుకునే దాన్నే కాదు. ఒక్క మజ్జిగ టాబ్లెట్ గాని, కాఫీ టాబ్లెట్ గాని వేసుకునేదాన్ని. అందుకు మా అమ్మాయి, నేనూ వెడుతుంటే, అక్కా చెల్లెళ్ళా అని అడుగుతారు. ఇప్పుడు గోధుమ టాబ్లెట్ ఒకటే వేసుకుంటున్నాను. అప్పుడు తినుబండారాలు చాలా వుండేవి కాబట్టి అనారోగ్యాలు కూడా వుండేవి. అవి తగ్గటానికి మందు టాబ్లెట్ చప్పరించి తరువాత ఒక నీటి బొట్టు శాస్త్రానికి నాలిక్కి రాసుకోవాలి. అప్పటివాళ్ళు శరీరానికి అనారోగ్యం చేస్తే చేదు టాబ్లెట్లు నీళ్ళతో మింగేవారు. కాని, అప్పటి అనారోగ్యాలు ఇప్పుడు లేవు కాబట్టి, ఇప్పటి వాళ్ళకి ఏదన్నా చిన్న అనారోగ్యం చేస్తే మందు టాబ్లెట్ కూడా ఆహారం టాబ్లెట్‌తో కలిపి తయారు చేస్తున్నారు. అందుకే అది చాలా రేటెక్కువ. మనం వేసుకునే ఆహారం టాబ్లెట్‌లలో కూడా ఎన్నోరెట్ల కేలరీల శక్తి వుంటుంది. అప్పటి వాళ్ళు నీరసాలొస్తే విటమిన్ టాబ్లెట్లు, బలం టానిక్కులు తాగేవారు. అన్ని రకాల ఆహార పదార్థాలున్నా కూడా కాస్త పని చేసి నీరసం అంటూ అలిసిపోయేవారు. ఇప్పటి వాళ్ళకి ఆ పన్లు లేవు కాబట్టి నీరసాలూ, అలిసిపోవడాలూ వుండవు. పైగా అప్పటి వాళ్ళకన్నా ఇప్పుడు మనమే ఎంతో బలంగా వున్నాము. నీళ్ళకి కరువు వచ్చినందువల్లే ఇలా ఎన్నో రకాలు కనిపెట్టారు.''

''అయితే భాగ్యలతగారూ! మన దేశం అభివృద్ధి చెందిందంటారా? లేక ఇంకా... ఇంకా...అట్టడుక్కి దిగజారిపోతోందా?'' ఫ్లాట్ నెంబరు ఏడులో వుండే సౌజన్య అడిగింది.

''భలేవారే సౌజన్యగారూ! ఇదంతా అభివృద్ధి కాదూ? నీళ్ళు లేకపోవడం వల్ల మన ఆడవాళ్ళకి వంట బాధ తప్పిందా! అందుకే కదా ఆడవాళ్ళంతా ఇప్పుడు ఉద్యోగాలు చేస్తున్నారు! కూటి కోసం కోటి విద్యలు అనే వారు పూర్వం. ఇప్పుడు టాబ్లెట్ల కోసం ఏదో ఓ ఉద్యోగం చేయాలి. ఇంకా వంటకి ఓ గది వుండేది.

అది తగ్గిందా? ఇంకా వంట సామాను, గ్యాస్... ఇలా ఎన్నో ఖర్చులు తగ్గాయా. ఇలా తెల్లవారి లేస్తే ఈ మనిషికి ఎంతో అవసరముండే నీళ్ళు దొరకక పోవడం వల్లే కదా, మానవుడు తన అమోఘమైన మేధాసంపత్తిని ఉపయోగించి, మనిషి నీళ్ళు లేకుండా కూడా ఎలా బతకవచ్చో ఆలోచించి అన్నీ కనిపెడుతున్నాడు. మరిదంతా అభివృద్ధి కాదూ''

అప్పుడు దాహం వేస్తే గ్లాసులు గ్లాసులు నీళ్ళు తాగే వారు. ఇంటికొచ్చిన అతిథులకి తాగటానికి ముందర మంచి నీళ్ళిచ్చి దాహం తీర్చే వారు. అప్పుడలా కాదు. దాహం వేస్తే ఒక నీటి టాబ్లెట్ వేసుకుంటాము. అప్పుడు లేవగానే పళ్ళు తోముకుని నీళ్ళతో శుభ్రపరుచుకునే వారు. ఇప్పుడు మనకి వారానికోసారి ఒక మిషన్ ద్వారా అంతా ఫ్రెష్ అయిపోతుంది.

అప్పుడు దాహం వేస్తే గ్లాసులు గ్లాసులు నీళ్ళు తాగే వారు. ఇంటికొచ్చిన అతిథులకి తాగటానికి ముందర మంచి నీళ్ళిచ్చి దాహం తీర్చేవారు. అప్పుడలా కాదు. దాహం వేస్తే ఒక నీటి టాబ్లెట్ వేసుకుంటాము. అప్పుడు లేవగానే పళ్ళు తోముకుని నీళ్ళతో శుభ్రపరుచుకునే వారు. ఇప్పుడు మనకి వారానికోసారి ఒక మిషన్ ద్వారా అంతా ఫ్రెష్ అయిపోతుంది. ఎందుకంటే అప్పటి వాళ్లలా ఆహారం తీసుకోం కాబట్టి ఎప్పుడు ఫ్రెష్‌గానే వుంటాం.''

''అయితే భాగ్యలతగారూ! అసలు ఈ నీటి బొట్టు మాత్రం ఎందుకు? అది కూడా లేకుండా ఏం కనిపెట్టలేరా?'' అడిగింది కొత్తగా అద్దెకి దిగిన కరిష్మా.

''తప్పమ్మా, తప్పు! చెంపలేసుకో. ఎప్పుడూ అలా అశుభం మాటలు అనకు. అందుకే ముందర ముందర 'నీళ్ళు అంటే ఏమిటి?' అని అడిగే పరిస్థితి రాకూడదనే శాస్త్రజ్ఞులు నీటిబొట్లు వీలైనంత ఎక్కువగా వచ్చేలా చూస్తున్నారు. చాలా నీటిబొట్లు టాబ్లెట్ల తయారీకి వాడవలసివస్తోంది. అందుకే మనకి నల్లాలో తక్కువ నీటిబొట్లు వస్తున్నాయి. పంచభూతాల్లో నీళ్ళు ఒకటి. అందుకే ఇంట్లో నీటిబొట్టు లేకుండా వుండకూడదు. అమంగళం కింద లెఖ్ఖ. దాహం వేస్తే టాబ్లెట్ తింటున్నప్పుడల్లా కనీసం మూడు నీటి బొట్లన్నా వేసుకోవాలి. ఒక నీటి బొట్టు తలకి, ఒక నీటి బొట్టు శరీరానికి రాసుకోవాలి. నీటిబొట్టు అంటే దేవుడి ప్రసాదంలా చాలా జాగ్రత్తగా వాడుకోవాలి. ఆ...ఇప్పటికీ అక్కడా, అక్కడా, కొన్ని ఇళ్ళలో నీళ్ళు ఎప్పుడూ వుంటాయట. వాళ్ళు వంటయింట్లో వంటలు వండుకుని భోంచేస్తారు. మనలా టాబ్లెట్లు మింగరు. ఇంకా ఉప్మా, ఇడ్లీ, పెసరట్టు...అన్నీ దొరుకుతాయి. ఎవరికన్నా అవి తినాలనిపపించినప్పుడు వెళ్ళి తినవచ్చు. కాని మనం వేసుకునే ఆహారం టాబ్లెట్ల కన్నా చాలా ధర ఎక్కువ.

అయ్యో! కబుర్లలో పడి మర్చిపోయాను. నల్లా వచ్చే టైమయింది. నీటిబొట్లు పట్టుకోవాలి. మళ్ళీ నల్లా బందవుతుంది''

''నీళ్ళ గురించి చాలా విషయాలు చెప్పారు భాగ్యలతగారూ! ఇవాళ మా ఇంట్లో పెళ్ళి కూడా వుంది. అందుకని చాలా నీటిబొట్లు పట్టుకోవాలి. మగపెళ్ళి వారికి కనీసం పది పదిహేను నీటిబొట్లన్నా ఇవ్వకపోతే చాలా హీనంగా చూస్తారు. అసలే నీటిబొట్లకి కరువుగా వుంది. ఎలా సమర్థించాలో అర్థం కావటల్లేదు'' అంటూ రమావతి గ్లాసులు తీసుకుని నల్లా వైపు బయల్దేరింది.

అపార్టుమెంట్లో అందరూ నీటిబొట్ల కోసం క్యూలో గ్లాసులు పెట్టి కూచున్నారు.

★

